## ప్రతి ఒక్కరూ భక్తిభావాన్ని అలవర్చుకోవాలి

- ఎమ్మెల్యే కాలె యాదయ్య



కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల రూరల్, జనవరి 2 : ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన, భక్తి భావం అలవర్చుకోవాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని చిన్న శంకర్‌పల్లి గ్రామంలో మంగళవారం గొల్ల కేతమ్మ, భ్రమరాంబ మల్లికార్జున స్వామి, బీరప్ప కామరాతి స్వాముల కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై పూజల్లో పాల్గొన్నారు. ఘనంగా సత్కరించి తీర్థ ప్రసాదాలనను అందజేశారు.

## చీరల పంపిణీ

పెద్దఅంబర్‌పేట, జనవరి 2: స్వచ్ఛంద సంస్థలు సామాజిక సేవలో భాగస్వాములవ్వాలని కౌన్సిలర్ వడ్డేపల్లి విద్యారెడ్డి అన్నారు. లయన్స్ పూర్వ గవర్నర్ వైఎం ధర్ పుట్టిన రోజును పురస్కరించుకుని హైదరాబాద్‌లోని కృష్ణానగర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ 4వ వార్డు పరిధి శాంతినగర్, వీపీఆర్ నగర్ వాసులకు మంగళవారం చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు విజయేందర్‌రెడ్డి, క్లబ్ గవర్నర్లు మనోహర్‌రెడ్డి, కృష్ణప్రసాద్, ఇన్నారెడ్డి, గంపా నాగేశ్వర్‌రావు, విశ్వేశ్వర్‌రావు, మండా సురేశ్, రామకృష్ణారావు పాల్గొన్నారు.

## డివైడర్‌ను ఢీకొని వ్యక్తి మృతి

ఆదిబట్ల, జనవరి 2 : డివైడర్‌ను ఢీ కొట్టడంతో ఒకరు మృతి చెందాడు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన బొంగుళూరు అవుటర్ రింగు రోడ్డు సమీపంలో మంగళవారం జరిగింది. సీఐ రఘువీర్‌రెడ్డి వివరాల ప్రకారం.. మన్నెగూడ కు చెందిన షణ్ముక సుందరం(25) మరో వ్యక్తి వినాయకంతో కలిసి బైకుపై వెళ్తున్నాడు. బొంగుళూరు అవుటర్ రింగు రోడ్డు వద్దకు రాగానే అతివేగంగా వెళ్లి రోడ్డు పక్కనే ఉన్న డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో షణ్ముక సుందరం అక్కడికక్కడే మృతి చెందాడు. వినాయకానికి తీవ్ర గాయాలయ్యాయి. అతడిని ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

యాచారం జనవరి2: విద్యుత్ మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపుల దృష్ట్యా గడ్డమల్లయ్యగూడ గ్రామంలో బుధవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ సందీప్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

## ప్రతి ఇంటికీ అయోధ్య రాముడి అక్షింతలు



చేవెళ్లరూరల్ : పూజలు నిర్వహిస్తున్న ప్రజాప్రతినిధులు

చేవెళ్ల రూరల్, జనవరి 2 : ప్రతి ఇంటికీ అయోధ్య రాముడి అక్షింతలు పంపిణీ చేయనున్నట్లు డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి అన్నారు. చేవెళ్ల మండల పరిధిలోని కౌకుంట్ల గ్రామంలో అయోధ్య నుంచి వచ్చిన రాముడి అక్షింతలకు ఆలయంలో పూజలు నిర్వహించి పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గాయత్రి, రైతు బంధు సమితి కౌకుంట్ల అధ్యక్షుడు నాగార్జునరెడ్డి పాల్గొన్నారు.

**ఆమనగల్లు** : పట్టణంలోని 15వ వార్డు శివాలయం కాలనీలో అయోధ్య రాముడి అక్షింతల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. మహిళలు మంగళహారతులతో స్వాగతించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ చెక్కల లక్ష్మణ్, భక్తులు సత్యనారాయణ, నారాయణ గౌడ్, కోట్ల వెంకటేశ్, చలిచీమల పెంటయ్య, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## కొత్తూరు సీఐగా నరసింహారావు

కొత్తూరు, జనవరి 2: కొత్తూరు సీఐగా వీ నరసింహారావును నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. కేబీహెచ్‌బీ ట్రాఫిక్ సెక్టార్‌లో నరసింహారావు ప్రస్తుతం పనిచేస్తున్నారు. ప్రస్తుతం ఎస్‌హెచ్‌వోగా పనిచేస్తున్న శంకర్‌రెడ్డి స్థానంలో నరసింహారావు బదిలీపై వచ్చారు. ప్రస్తుతం కొత్తూరు సీఐగా పనిచేస్తున్న శంకర్‌రెడ్డి కౌంటర్ నార్కోటిక్ ఆపరేషన్ టీమ్ (సీఎన్‌వోటీ)కి బదిలీపై వెళ్లారు. శంకర్‌రెడ్డి ఎన్నికల బదిలీల్లో భాగంగా కొత్తూరు సీఐగా నియామకం అయ్యారు.

# ఫార్మాసిటీ.. కొలువు గ్యారెంటీ..!

- ఫార్మాసిటీని యథాతథంగా కొనసాగించాలని ప్రభుత్వ నిర్ణయం
- ఇంటికో ఉద్యోగమిస్తామని గతంలోనే ప్రకటించిన బీఆర్ఎస్ ప్రభుత్వం
- తాజాగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటనతో భూనిర్వాసితుల్లో చిగురిస్తున్న ఆశలు



మళ్లీ జీవం పోసుకోనున్న రేడియల్ రింగ్‌రోడ్‌లు

ఇబ్రహీంపట్నం, జనవరి 2 : ఫార్మాసిటీ ఏర్పాటు యథాతథంగా ఉంటుందని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో ఫార్మాసిటీ వల్ల భూములు కోల్పోతున్న రైతుల్లో ఇంటికో ఉద్యోగం వస్తుందనే ఆశ మళ్లీ చిగురించింది. ఫార్మాసిటీ ఏర్పాటు కోసం ఇప్పటికే రైతుల నుంచి గత బీఆర్ఎస్ ప్రభుత్వం భూసేకరణ చేపట్టింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఫార్మాసిటీని రద్దు చేస్తామని ప్రకటించడంతో చాలామంది రైతులు తమకొచ్చే ఇంటికో ఉద్యోగం రాదనే భావనలో ఉన్నారు. తాజాగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫార్మాసిటీని కొనసాగిస్తామని ప్రకటించడంతో వారిలో ఆశలు చిగురించాయి. యాచారం మండలంలోని మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద తదితర గ్రామాల నుంచి ఫార్మాసిటీ కోసం గతంలో భూసేకరణ చేపట్టారు. సేకరించిన భూములను కాలుష్య రహిత ఫార్మా కంపెనీల ఏర్పాటు కోసం అన్ని ఏర్పాట్లు చేశారు. భూములు కోల్పోయే రైతులకు ఎకరాకు 121 గజం చొప్పున కందుకూరు మండలంలోని మీర్‌ఖాన్‌పేట్ వద్ద మెగా టౌన్‌షిప్‌ను ఏర్పాటుచేసి అందులో ఇండ్ల స్థలాలు కూడా కేటాయించారు. ఇండ్ల స్థలాలు తీసుకున్న రైతులు ఇంటికో ఉద్యోగంపై కూడా ఆశలు పెట్టుకున్నారు.

### రియల్ వ్యాపారుల్లో చిగురించిన ఆశలు

ఫార్మాసిటీ ఏర్పాటు ప్రకటన తర్వాత ఈ ప్రాంతంలో ఫార్మా అనుబంధ సంస్థల కోసం పెద్ద ఎత్తున రియల్ వ్యాపారం జరిగింది. ఫార్మా అనుబంధ పరిశ్రమల కోసం ఫార్మాసిటీ చుట్టుపక్కల పెద్ద ఎత్తున వేలాది ఎకరాల భూములను కంపెనీ యజమానులు కొనుగోలు చేశారు. ఫార్మాకు అనుబంధంగా ఉండే అన్ని రకాల పరిశ్రమలతో పాటు హోటళ్లు, వ్యాపార సంస్థల ఏర్పాటు తదితర పరిశ్రమల యజమానులు ఈ ప్రాంతంలో భూములు కొనుగోలు చేశారు. ముఖ్యంగా పెద్దపెద్ద పేరున్న రియల్‌ఎస్టేట్ సంస్థలు కూడా ఈ ప్రాంతంలో పెద్ద ఎత్తున భూములు కొనుగోలు చేసి ప్లాట్లుగా మార్చి క్రయవిక్రయాలు జరిపారు. ఫార్మాసిటీ రద్దుచేస్తామని ప్రకటించిన నేపథ్యంలో వారంతా తీవ్ర నిరాశకు లోనయ్యారు. ప్రభుత్వం యూటర్న్ తీసుకుని ఫార్మాసిటీని కొనసాగిస్తామని ప్రకటించటంతో వారిలో తిరిగి కొత్త ఆశలు చిగురించాయి. ఇప్పటికే భూసేకరణకు రైతులు ఒప్పుకుంటారో...లేదో అన్న ఉద్దేశంతో ప్రభుత్వం రద్దు నిర్ణయాన్ని ఉపసంహరించుకుంది. ఫార్మాసిటీని రద్దుచేసి టౌన్‌షిప్‌లు నిర్మిస్తామన్న నిర్ణయాన్ని ఈ ప్రాంత ప్రజలు వ్యతిరేకించారు. ఫార్మాసిటీని రద్దుచేస్తే ఆ భూములు తమకే ఇవ్వాలన్న ప్రతిపాదన కూడా రైతులు తీసుకువచ్చారు. దీంతో ప్రభుత్వం అయోమయ స్థితిలో పడింది. ఈ పరిస్థితుల దృష్ట్యా ఫార్మాసిటీని ఇక్కడే కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

### మళ్లీ జీవం పోసుకోనున్న రేడియల్ రింగ్‌రోడ్‌లు

ఫార్మాసిటీకి నగరంతోపాటు వివిధ ప్రధాన ప్రాంతాల నుంచి రవాణా సౌకర్యాన్ని మెరుగుపర్చాలన్న ఉదేశంతో రేడియల్ రింగ్‌రోడ్డులు ఏర్పాటు చేయాలని గత ప్రభుత్వం నిర్ణయించింది. ఫార్మాసిటీని రద్దు చేయబోమని, ఇక్కడే కొనసాగిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించిన నేపథ్యంలో రేడియల్ రింగ్‌రోడ్డులు మళ్లీ జీవం పోసుకోనున్నాయి. ఇప్పటికే హైదరాబాద్-శ్రీశైలం రహదారి నుంచి నాగార్జునసాగర్ రహదారి వరకు ఫార్మాసిటీని కలుపుతూ వందఫీట్ల రోడ్డును కూడా ఏర్పాటు చేశారు. ఈ రోడ్డును కందుకూరు నుంచి మీర్‌ఖాన్‌పేట్ మీదుగా నందివనపర్తి, మొగుళ్లవంపు మీదుగా యాచారం వద్ద సాగర్‌రహదారికి అనుసంధానం చేశారు. ఈ పనులు దాదాపు ఇప్పటికే 90 శాతం పూర్తయ్యాయి. ఈ రోడ్డు పనులు పూర్తవుతున్నందున ఈ రోడ్డుకిరువైపులా కూడా అనేక పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు పారిశ్రామిక వేత్తలు భూములు కూడా కొనుగోలు చేశారు. దీంతో ఫార్మాసిటీని ఇక్కడే కొనసాగిస్తుండటంతో ఈ ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు చేయటానికి ముందుకొచ్చిన వ్యాపార వేత్తలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# గ్యారెంటీలు అమలు చేసి తీరుతాం : స్పీకర్ ప్రసాద్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

వికారాబాద్, జనవరి 2: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా నాయకులు అధికారులు ప్రజల వద్దకే వచ్చి దరఖాస్తులను పైసా ఖర్చు లేకుండా స్వీకరిస్తున్నట్లు రాష్ట్ర శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. మంగళవారం వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని 20వ వార్డు రాజీవ్ గృహకల్ప కాలనీలో నిర్వహించిన ప్రజా పాలన వార్డు సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామన్నారు. ఒక్కటే దరఖాస్తుతో అన్ని గ్యారెంటీలకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. రేషన్ కార్డుల కోసం తెల్ల కాగితంపై దరఖాస్తు రాసి ఇవ్వాలని అన్నారు. ముందుగా అర్హులైన అందరికీ తెల్ల రేషన్ కార్డులు అందించిన పిదప మిగతా పథకాలను అమలు చేస్తామన్నారు. రాజీవ్ గృహ కల్ప కాలనీలో ఉన్న సమస్యలను తీరుస్తానని తెలిపారు.

అన్ని పథకాలను ఇంటింటికి అందించే పూర్తి బాధ్యత తనదేనని, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు అనంతగిరి గుట్టను ఈకో టూరిజం కింద రూ. 200 కోట్ల నిధులతో అభివృద్ధి పరుస్థానన్నారు. ఇప్పటికే కోట్‌పల్లి ప్రాజెక్టు వద్ద బోటింగ్ సదుపాయం కల్పించి యువతకు ఉపాధి కల్పించినట్లు గుర్తు చేశారు. వికారాబాద్‌కు టెక్స్ టైల్స్ పార్క్ తీసుకు వచ్చి నాలుగు వేల మంది మహిళలకు, అలాగే పరిశ్రమలను స్థాపించి స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తానని తెలియజేశారు.

కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని 566 గ్రామ పంచాయతీలు, నాలుగు మున్సిపాలిటీలలో గల 97 వార్డులలో గ్రామ సభలు నిర్వహించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ, మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల, వైస్ చైర్ పర్సన్ శంషాద్ బేగం, వార్డ్ కౌన్సిలర్ మురళి, కౌన్సిలర్ సుధాకర్‌రెడ్డిలతో పాటు స్థానిక మున్సిపల్ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ సొమ్మును వృథా చేస్తే కఠిన చర్యలు

దోమ, జనవరి 2: ప్రభుత్వ సొమ్మును వృథా చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా ఏపీడీ స్టీవెన్‌నీల్ అన్నారు. దోమ మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 14వ విడత సామాజిక తనిఖీలో భాగంగా 2022 మార్చి నుంచి 2023 డిసెంబర్ నెల వరకు జరిగిన పనులపై ప్రజా వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పనులకు సంబంధించిన బిల్లుల చెల్లించే క్రమంలో అవకతవకలకు పాల్పడితే పెనాల్టీతో పాటుగా వారిపై సస్పెన్షన్ వేటు వేయడం ఖాయమన్నారు. పనులు చేయకుండానే కొందరు వ్యక్తులకు డబ్బులు చెల్లించారని, చనిపోయిన కొందరి ఖాతాల్లో కూడా పేమెంట్‌లు వేశారని తనిఖీ బృందాలు గుర్తించగా స్పందించిన ఏపీడీ చనిపోయిన వారిని జాబ్ కార్డుల నుంచి తొలగించాలని ఉపాధి హామీ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అనసూయ, వైస్ ఎంపీపీ మల్లే శం, ఎంపీడీవో జయరాం తదితరులు పాల్గొన్నారు.



సామాజిక తనిఖీ ప్రజావేదికలో మాట్లాడుతున్న ఏపీడీ స్టీవెన్‌నీల్

## పెట్రోల్ బంకులు తెరిచే ఉంటాయ్

వికారాబాద్, జనవరి 2 : పెట్రోల్ బంకులు బంద్ అనే వార్తలో వాస్తవం లేదని వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెట్రోల్ బంకులు యథా విధిగా పనిచేస్తాయని, సోషల్ మీడియాలో వస్తున్న వార్తలను నమ్మి ప్రజలు ఇబ్బందికి గురికాకూడ దన్నారు. తెలంగాణతో సహా పలు ప్రాంతాలలో పెట్రోల్ బంక్ యజమానులు సమ్మెకు దిగుతు న్నారని, ఇంధన కొరత ఏర్పడటం వల్ల వచ్చే మూడు రోజులపాటు బంకులు బంద్ ఉంటాయనే విషయంలో వాస్తవం లేదని తెలిపారు